కాంగ్రెస్ హామీలపై ప్రజాక్షేత్రంలో నిలదీద్దాం

- ఆ పార్టీ ద్రోహాన్ని వివరిద్దాం
- రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదు
- ప్రజాక్షేత్రంలో ఆ పార్టీలను ఎండగడదాం
- తెలంగాణకు బీఆర్ఎస్సే రక్ష: కేసీఆర్
- చేవెళ్ల, నల్లగొండ లోక్‌సభ స్థానాల అభ్యర్థులపై సమీక్ష

సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా నేతలతో సమావేశమైన ఆ పార్టీ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని, ఆ పార్టీలు తెలంగాణకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నేతలకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. సోమవారం నందినగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన విడివిడిగా సమావేశమై కాంగ్రెస్ హామీలపై నిలదీద్దామని చెప్పారు. ఈ సందర్భంగా వారు నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు పడుతున్న ఇబ్బందులను కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం రైతులకు విద్యుత్తు కూడా ఇవ్వలేకపోతున్నదని, బోర్ల కింద పంటలు వేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యేట్టు ఉన్నదని, ప్రభుత్వం సాగునీళ్లు, కరెంటు ఇవ్వటంలో పూర్తిగా విఫలమైనదని వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెలంగాణ నాడు, నేడు ద్రోహమే చేసిందని, ఏనాడూ ఆ పార్టీ తెలంగాణ పక్షాన లేదని విమర్శించారు. పదేండ్లలో బీజేపీ రాష్ట్రానికి చేసిన మేలు ఒక్కటీ లేదని తెలిపారు. కేవలం మతాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవటమే ఆ పార్టీకి తెలిసిన విద్య అని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలతో తెలంగాణకు, ప్రజలకు ఉపయోగం లేదని, కేంద్ర ప్రభుత్వంతో తలపడే విషయంలో, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే అంశంలో బీఆర్ఎస్ పార్టీనే ముందుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణకు రక్ష బీఆర్ఎస్‌నే అని, బీఆర్ఎస్ పార్టీ పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని కేసీఆర్ గుర్తుచేశారు.

చేవెళ్ల నేతలతో సమావేశం

చేవెళ్ల లోక్‌సభ స్థానంపై సమావేశంలో ఎమ్మెల్యేలు సబిత, అరికపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాసాని, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. అభ్యర్థి ఎంపికపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుందామని నేతలకు కేసీఆర్ తెలిపారు.

టికెట్లకు పోటాపోటీ

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు నల్లగొండ స్థానానికి పలువురు ఆసక్తిచూపుతున్నట్టు పార్టీ జిల్లా నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపురెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, గుత్తా అమిత్ తదితరులు నల్లగొండ నుంచి పోటీచేసేందుకు గతంలో సుముఖత వ్యక్తం చేశారని, భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, క్యామ మల్లేశ్, జిట్టా బాలకృష్ణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు పోటీకి ఆసక్తి చూపుతున్నట్టు వెల్లడించారు. రెండు స్థానాలకు ఎవరు అభ్యర్థిగా ఉంటే బాగుంటుందో చర్చించుకొని రావాలని వారికి కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థి ఎవరనేది ప్రకటించుకుందామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సమావేశంలో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, బొల్లం మల్లయ్యయాదవ్, భాస్కరరావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రనాయక్, పార్టీ నేతలు చెరుకు సుధాకర్, నర్సింహారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



మొదటి జాబితాలో టికెట్లురాని వాళ్లు కోపంతో వచ్చి తిడుతున్నారు.. కనీసం రెండో జాబితాలోనైనా టికెట్లు వస్తాయోమోనని..!

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): సౌదీ అరేబియాలో ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించిందన్న ప్రకటనతో మన దేశంలో మంగళవారం నుంచి పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభం కానున్నది. సౌదీ ప్రెస్ ఏజెన్సీ ప్రకటనతో ఆ దేశంలో సోమవారం నుంచే రంజాన్ నెల మొదలైంది. అక్కడి ముస్లింలు ఉపవాస దీక్షలను మొదలుపెట్టారు. యూఏఈ, ఖతార్‌లో కూడా సోమవారమే మొదటి రోజుని ప్రకటించాయి. మన దేశంలో మాత్రం మంగళవారం నుంచి ఉపవాస దీక్షలను పాటించనున్నారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు దాదాపు ఒక మాసంపాటు ఈ దీక్షలను పాటిస్తారు. తిరిగి నెలవంక దర్శనంతో రంజాన్ మాసం ముగించి ఈద్-ఉల్-ఫితర్‌ను నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ మాసంలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రముఖ మసీదుల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రజల నడుమ శాంతి సామరస్య భావనలు వెల్లివిరుస్తాయని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడచిన పదేండ్ల పాలనలో ప్రగతి, సంక్షేమం సమాహారంగా తెలంగాణ రాష్ట్రాన్ని గంగా జమున తెహజీబ్‌కు ప్రతీకగా, దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని కేసీఆర్ తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రత్యేకంగా ప్రార్థించారు.

కోతల సర్కారుకు వాతలే

- 2 లక్షల రుణమాఫీ, బోనస్ ఏమైంది?
- సాగు వ్యతిరేక కాంగ్రెస్‌పై రైతుల్లో ఆగ్రహం
- దించుడు నీకు, నీ గురువుకు అలవాటు
- ప్రజలనే నమ్ముతం.. చిల్లర పని చెయ్యం
- బజారు భాష కంటే హీనంగా సీఎం తీరు
- సామాజిక న్యాయం భట్టికే దిక్కులేదు
- ఎరుకల సామాజిక వర్గానికి గవర్నర్ అన్యాయం: మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటలో నియోజకవర్గ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

> రేవంత్.. నువ్వు బోనస్ ఎగ్గొట్టినవ్, రైతు రుణమాఫీ ఎగ్గొట్టినవ్, 15 వేల రైతుబంధు ఎగ్గొట్టినవ్, తులం బంగారం ఎగ్గొట్టినవ్. ఇంకా సిగ్గులేకుండా ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నవ్? నోరు పెంచుకోవటం కాదు. విజ్ఞతతో పాలన చెయ్యి.
>
> \- హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు కర్రుకాల్చి వాత పెట్టాలని ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనకు ఈ పార్లమెంట్ ఎన్నికలే రెఫరెండం అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, గెలిచిన తర్వాత ఏమి చేశారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై అంతటా చర్చ మొదలైందని చెప్పారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలపై సిద్దిపేటలో జరిగిన సన్నాహక సమావేశంలో, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని, మూడు నెలల కాంగ్రెస్ పాలనలో హామీల అమలుపై శ్రద్ధ చూపటం లేదని ఆరోపించారు. రైతులు సమస్యలతో అల్లాడుతున్నారని, పొలాలకు నీరందక పరేషాన్‌లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైంది? వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు 13 హామీలు ఎక్కడ పోయాయి? మా అక్కచెల్లెళ్లకు ఇస్తానన్న రూ.2,500 ఎక్కడపోయాయి? మా అవ్వాతాతలకు ఇచ్చే రూ.4 వేల పెన్షన్ ఎక్కడ? రేవంత్ రెడ్డి' అని నిలదీశారు. హామీలు ఎగ్గొట్టే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన ఉండే, తెలంగాణ హక్కులపై నిరంతరం గళమెత్తే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఢిల్లీలో తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ బలంగా ఉండాలని అన్నారు. ఎన్నడైనా జై తెలంగాణ అన్న ముఖమా? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. తెలంగాణ కోసం తాను 4 నెలలు జైల్లో ఉన్నానని అన్నారు. 'తెలంగాణ ప్రజల కోసం కొట్లాడే పార్టీ బీఆర్ఎస్. ఈ పార్టీని లేకుండా చేద్దామనుకుంటున్నరు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది' అని స్పష్టం చేశారు.

డిప్యూటీ సీఎంకే సామాజిక న్యాయం లేదు

కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం సాక్షాత్తు ఆ పార్టీ ఉపముఖ్యమంత్రికే దొరకటం లేదని, ఇక సామాన్యుడికి ఏం దొరుకుతుందని హరీశ్‌రావు విమర్శించారు. 'కాంగ్రెస్ పాలనకు ఈ పార్లమెంట్ ఎన్నికలే రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. అసలు వీళ్లు ఏం చేశారు? కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై అంతటా చర్చ మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది. బీజేపీ తెలంగాణకు ఏ ఒక్క జాతీయ ప్రాజెక్టు, ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ విద్యాలయం ఇవ్వలేదు' అని వెల్లడించారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదని హరీశ్ ఎద్దేవా చేశారు.

బజారు మనుషులు కూడా అలా మాట్లాడరు

రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష.. బజారు భాష కంటే హీనంగా ఉన్నదని హరీశ్ మండిపడ్డారు. ఒక సీఎంలా మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. బజారు మనుషులు కూడా ఆ రకంగా మాట్లాడరని, సీఎం పదవిని దిగజార్చేలా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'మొన్న మోదీ వస్తే సాష్టాంగ నమస్కారం పెట్టిండు. బడే భాయి అంటుండు. ఏడికెల్లి వచ్చిండు బడేభాయ్. బడేభాయ్, చోటాభాయ్ ఒక్కటైండ్రు. బీజేపీతో కుమ్మక్కయిండు' అని ధ్వజమెత్తారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డలో రెండు పిల్లర్లు దెబ్బతింటే బాగు చేయటం చేతకాక కేసీఆర్‌ను తిడతావా? మీ పాలనలో కడెం వాగు, పాలెం వాగు కొట్టుకుపోలేదా? దేవాదుల పైపులు పగల్లేదా? సిగ్గులేకుండా మాయమాటలు చెప్పి ఎన్నేండ్లు బతుకుతవ్? యాసంగి వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడుగు' అని రేవంత్‌కు సవాల్ విసిరారు.

ఎరుకలకు గవర్నర్ అన్యాయం

ఎరుకల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను కేసీఆర్ ఎమ్మెల్సీగా నామినేట్ చేశారని, కానీ.. గవర్నర్ తమిళిసై ఆమోదించకుండా ఎరుకల వర్గానికి అన్యాయం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రిమండలి తీర్మానం చేసి పంపినదాన్ని తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని తెలిపారు.

శివాజీ స్ఫూర్తితో కేసీఆర్ పోరాటం

ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రారంభించుకోవటం సంతోషంగా ఉన్నదని హరీశ్ అన్నారు. శివాజీ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా జీవించేవని, మత సామరస్యానికి శివాజీ ప్రతీక అని చెప్పారు. ఆయన ఏ ఒక్క వర్గానికో పరిమితమైన వ్యక్తి కాదని, ఆయన సైన్యంలో కీలక స్థానాల్లో ముస్లింలు కూడా పని చేశారని గుర్తుచేశారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో కేసీఆర్ 14 ఏండ్లు పోరాడి తెలంగాణను సాధించారని, శివాజీ బాటలో పదేండ్లు అద్భుతంగా పాలించారని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలివ్వాలి: హరీశ్‌రావు ట్వీట్

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 60 వేలకుపై ఉద్యోగులు, కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వీరికి నెలల పాటు జీతాలివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ఎక్స్ వేదికగా వివరించారు. పేద వర్గాలకు చెందిన ఈ కార్మికుల కష్టాలను అర్థం చేసుకొని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకొన్న నటుడు ఆర్ నారాయణమూర్తి

హజ్ కమిటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సయ్యద్ గులాం అఫ్జల్ బియాబాని సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నాంపల్లిలోని హజ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని హాజరయ్యారు. బియాబానికి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఈవో లియాఖత్ హుస్సేన్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వెయ్యికి పైగా పోస్టులు మళ్లీ బ్యాక్‌లాగ్!

మొదటిపేజీ తరువాయి...

రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) గురుకులాల్లోని పోస్టుల భర్తీ ప్రక్రియను అసమగ్రంగా చేపట్టిందని అభ్యర్థులు మండిపడుతున్నారు. రీలింక్విష్‌మెంట్‌పై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పోస్టుల ఎంపికపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమకు తీరని అన్యాయం వాటిల్లుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

3 వేల మందికి ఒకటికి మించి పోస్టులు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లోని 9 క్యాటగిరీల్లో 9,210 పోస్టుల భర్తీ ప్రక్రియను ట్రిబ్ చేపట్టింది. ఇప్పటివరకు పీజీటీ 1,276, టీజీటీ 4,020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2,876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఇతర పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలను ట్రిబ్ ఇటీవలే ప్రకటించింది. ఆయా సొసైటీలకు అప్పగిస్తూ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను కూడా అందించింది. డీఎల్, జేఎల్ పరీక్షకు, పీజీటీ పోస్టులకు సమాన అర్హతలు ఉన్నాయి. చాలామంది అభ్యర్థులు పీజీటీతోపాటు, జేఎల్, డీఎల్ పరీక్షలకూ హాజరయ్యారు. పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల్లో అనేక మంది డీఎల్, జేఎల్ పోస్టులకూ ఎంపికయ్యారు. వీరిలో టీజీటీ పోస్టులకు సైతం పలువురు ఎంపికయ్యారు. ట్రిబ్ ప్రకటించిన జాబితా ప్రకారమే దాదాపు 3 వేల మందికి పైగా అభ్యర్థులు ఒకటికి మించి పోస్టులను సాధించినట్టు తెలుస్తున్నది. పదుల సంఖ్యలో అభ్యర్థులు పీజీటీతో పాటు జేఎల్, డీఎల్ పోస్టులకూ ఎంపికయ్యారు. టీజీటీ సాధించిన వారిలోనూ పీజీటీతోపాటు, జేఎల్ ఎంపికైన వారూ ఉన్నారు.

డీఎల్, జేఎల్ పోస్టులకే మొగ్గు

వారిలో చాలామంది పీజీటీ అభ్యర్థులు అంతకంటే ఉన్నతమైన డీఎల్, జేఎల్ పోస్టులకే మొగ్గు చూపారు. దీంతో 1,276 పీజీటీ పోస్టుల్లో సగానికిపైగా ఖాళీగా ఏర్పడినట్టు తెలుస్తున్నది. ఇక అదే పరిస్థితి 4,070 టీజీటీ పోస్టుల్లోనూ కనిపిస్తున్నది. ఒకటి మించి పోస్టులు సాధించిన 3వేల మంది ఏదో ఒక దానినే ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో భారీగానే ఖాళీలు ఏర్పడే అవకాశమున్నది. ట్రిబ్ డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకపోవడంతో 1:2 జాబితాలోని అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. రిలిక్విష్‌మెంట్ విధానం అమలు చేస్తే గురుకుల పోస్టుల్లో మళ్లీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడే అవకాశం ఉండకపోయేది.

1:2 జాబితా అభ్యర్థుల గోడు పట్టించుకోని సర్కారు

రిలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని, రెండో జాబితాను ప్రకటించాలని గురుకుల అభ్యర్థులు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. నియామకాల కోసం ఏండ్ల తరబడి ఎదురు చూశామని, 1:2 జాబితాలోకి వచ్చినా తుది జాబితాలో చోటు దక్కలేదని, రీలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తే తమలో ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇదే విషయమై అన్నివిధాలుగా, అన్ని వేదికలపై తమ గళాన్ని వినిపిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలను అందజేసినా ఎలాంటి స్పందన రాలేదని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చేలోగానైనా రీలింక్విష్‌మెంట్ అమలు చేసేలా ట్రిబ్‌కు ఆదేశాలివ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కలిసొచ్చిన నేల నుంచే కదనభేరి

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. అప్పటినుంచి ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు అహరహరం శ్రమిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఏర్పాట్లను, జన సమీకరణను అనునిత్యం పర్యవేక్షిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ముంగిట్లో నిర్వహిస్తున్న కదనభేరిని బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైనదిగా భావిస్తున్నది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీచేసే జనాకర్షక నాయకులు లేని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీఆర్ఎస్ నేతలకు గాలం వేస్తున్న నేపథ్యంలో ఈ సభ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నది. కరీంనగర్ గడ్డ మరోసారి తెలంగాణ రాజకీయాలకు దిశానిర్దేశం చేస్తుందని గులాబీ శ్రేణులు నిశ్చితాభిప్రాయంతో ఉన్నాయి. ఈ సభ వేయబోయే ముద్రను గులాబీ పార్టీ శ్రేణులతోపాటు రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు సైతం ఆసక్తిగా గమనిస్తున్నాయి.

కరీంనగర్‌తో వీడదీయరాని బంధం

కరీంనగర్ అంటే బీఆర్ఎస్‌కు ప్రత్యేకమైన సెంటిమెంట్ ఉన్నది. కేసీఆర్ ఏ కార్యక్రమాన్ని చేపట్టినా కరీంనగర్ నుంచే మొదలుపెట్టి విజయతీరాలకు చేర్చిన చరిత్ర ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ నుంచి, సకల జనుల సమ్మెకు పిలుపు వరకు అనేక కీలక ఘట్టాలకు కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానమే వేదికగా నిలిచింది. 2001 మే 17న సింహగర్జన పేరిట నిర్వహించిన సభ యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలించింది. 2004లో బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొంత కాలానికి తెలంగాణవాదం లేదంటూ నాటి పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కేసీఆర్ తన ఎంపీ పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికల బరిలో నిలిచి, అదే కాంగ్రెస్ అభ్యర్థిపై 2,01,582 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం ఓ అద్భుత చరిత్ర. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలమంటూనే అనేక కమిటీలు వేసి కాలయాపన చేస్తున్న కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నాన్చుడు ధోరణిని నిరసిస్తూ కేసీఆర్ 2009 నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో.. కేసీఆర్ శవయాత్రో కేసీఆర్ జైత్రయాత్రో అంటూ ఆమరణ నిరాహార దీక్షకు బయలుదేరింది ఇదే కరీంనగర్ గడ్డ నుంచే. 11 రోజుల అనంతర పరిణామాల్లో కేంద్రం దిగొచ్చి 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన చేయడం ఇంకా కండ్లముందే కదలాడుతున్న దృశ్యం. 2011 సెప్టెంబర్ 23న ప్రారంభమైన సకల జనుల సమ్మె పిలుపునకు ఎస్సారార్ కళాశాలే వేదికైంది. ఈ మైదానంలో జరిగిన బహిరంగ సభ నుంచే సకలజనుల చారిత్రక సమ్మెకు పిలుపు నిచ్చారు. 2014 ఏప్రిల్ 13న ఆనాడు జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఇదే కళాశాల వేదికగా జరిగిన బహిరంగ సభలో తొలి సమర శంఖారావం పూరించారు. అద్భుత విజయాలను సాధించారు. ఇలా అనేక పరిణామాలకు వేదికగా నిలిచిన కరీంనగర్ నేడు కదనభేరి మోగించనున్నది.

బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు

గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్‌కే అన్ని వర్గాల ప్రజల మద్దతు లభించింది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మూడింట విజయం సాధించిన బీఆర్ఎస్ అన్ని పార్టీల కంటే అత్యధిక ఓట్లు సాధించడం విశేషం. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయంతో పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధ్యమవుతుందనే నమ్మకం బీఆర్ఎస్ పార్టీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ అందరికంటే ముందుగానే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఈసారి బీఆర్ఎస్ గెలుపు తథ్యమనే అభిప్రాయం ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నది. మూడు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత మొదలైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, అమలుచేస్తున్నవాటికి కూడా షరతులు వర్తింపజేయడం, రైతులకు పదేండ్ల నాటి కష్టాలు చూపించడం వంటి అనేక కారణాల రీత్యా కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్న కృతనిశ్చయంతో పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పార్టీ క్యాడర్‌తో వినోద్‌కుమార్‌కు ఉన్న సత్సంబంధాలు, ప్రజల్లో ఉన్న ఇమేజీని గెలుపు బాటలో నడిపించేందుకు వినియోగించుకోవాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా బోయినపల్లి వినోద్ కుమార్ చేసిన అభివృద్ధి పనులను, ఇప్పటి బీజేపీ ఎంపీ బండి సంజయ్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపును సుసాధ్యం చేసుకోవాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

లక్ష మందితో కదనభేరి

పార్టీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ప్రజల్లో మంచి పేరు ఉండటం, మూడు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలవడంతో కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందనే భావన ప్రజల్లో నెలకొన్నది. కేసీఆర్ పాలనలో నిండు వేసవిలో కూడా చెరువుల మత్తళ్లు పారాయి. నిర్విరామంగా ప్రాజెక్టుల నుంచి నీళ్లు వచ్చాయి. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులు పుష్కలంగా పంటలు పండించారు. కాంగ్రెస్ చేతికి అధికారం వెళ్లగానే రాష్ట్ర వ్యాప్తంగా అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంటలు ఎండి పోతున్నాయని ఎంత మొత్తుకున్నా నీళ్లిచ్చే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. పంట పొలాలను రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాటి బీఆర్ఎస్ పాలన, నేటి కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలపర్చాలనే నిర్ణయం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో కరీంనగర్ కదనభేరికి లక్ష మందిని సమీకరించి రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చాటి చెప్పాలని బీఆర్ఎస్ భావిస్తున్నది.

కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ కదనభేరి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ పలువురు నేతలు

కదనభేరిని జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే గంగుల, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 11: కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ కదనభేరి సభకు పార్లమెంట్ పరిధిలోని ప్రజలు, రైతులు, యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ, కరీంనగర్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. అనంతరం కళాశాలలో చేస్తున్న సభ ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక రైతుల కండ్ల నుంచి కన్నీరు వస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గొంతు ఉండటం ఎంతో అవసరమని, అందుకు వినోద్‌కుమార్‌ను కరీంనగర్‌కు ఎంపీగా గెలిపించుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అవసరం ఎంత ఉంటుందో కేసీఆర్ ప్రజలకు వివరిస్తారని చెప్పారు. తెలంగాణపై స్పృహ, సోయి ఉన్న వారే పార్లమెంట్‌లో ఎంపీలుగా ఉంటేనే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడవచ్చని, కదనభేరి సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొదటి సభను కరీంనగర్ నుంచే కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. మేడిగడ్డ వద్ద మూడు పిల్లర్లలో సమస్యలు వస్తే.. మూడు నెలలు అవుతున్నా సమస్య ఎక్కడ వచ్చిందో కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించలేకపోయిందని విమర్శించారు. దీని వల్ల పంట పొలాలకు నీరు అందక.. రైతులు ఎండిన పంటలను అగ్నికి ఆహుతి చేస్తున్నారని, ఇది ఎంతో బాధను కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉంటే ఇప్పటికే ఆ మూడు పిల్లర్ల వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించి అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి మధ్యమానేరు, ఎల్ఎండీ ద్వారా రైతులకు సాగునీరు అందించేవారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు లోక బాపురెడ్డి, పొన్నం అనిల్‌కుమార్, భూక్య తిరుపతినాయక్ పాల్గొన్నారు.